# లలిత సంగీతం

నరసింహంగారు సగం ఎండలోనూ సగం నీడలోనూ కూచుని భాగవతం చదువుకుంటున్నారు. ఆయనకి పేజీలకి మధ్యగా అక్షరాలకి అడ్డుగా ఏదో వస్తువూ, దాన్ని పట్టుకున్న చిన్న చెయ్యీ కనిపించాయి.

'అబ్బ, చదువుకో నియ్యకుండా ఏవిట్రా ఈ అల్లరీ?' అంటూ ఆయన కళ్లజోడులోంచి యివతలకి చూస్తే బాబు కనిపించాడు.

'తాతా, ఈ బొమ్మ చూశావా, ఎంత బాగుందో!'

'బలేబాగుందిరా, ఎక్కడిది ఇది?'

'ఆ బొమ్మ నాది తాతయ్యా!'

అంటూ జోళ్లు చప్పుడు చేసుకుంటూ ఓ పాప అక్కడికి పరిగెత్తుకు వచ్చింది. ఎగిరేటి ఎలదేటి లాటి ఆ పాపను చూడగానే నరసింహంగారు రెండు చేతులతోనూ ఎత్తుకుని గట్టిగా ముద్దెట్టుకుని పాపని చూపిస్తూ—

'మరి ఈ బొమ్మ ఎవరిది?' అని అడిగారు పెంకితనంగా.

'నాది!'.

గుమ్మంలోంచి ఒక తియ్యని కంఠం వినిపించింది. బొంబాయిలో ఉంటున్న లలిత హఠాత్తుగా కాకినాడలో ఎలా ప్రత్యక్షమయింది, అన్న దానికంటె నరసింహంగార్ని దిగ్భ్రాంతుల్ని చేసింది మరొకటుంది. ఆ పలికిన తీరుచూసి, ఆ నిలచిన తీరు చూసి ఆయన అలా ఉండి పోయారు. "'కిస్' చేసి 'విష్' చేసే పాశ్చాత్య పద్ధతి ఎంత మంచిది!" అని ఆయన అనుకొని ఉండొచ్చును.

'నువ్వటమ్మా లలితా, రా, రా! ఏమేవ్ యిదిగో ఎవరొచ్చారో చూడు' పార్వతమ్మ తాగుతున్న కాఫీగ్లాసు చేత్తోపట్టుకుని అలాగే ఇవతలి

కొచ్చింది. ఈలోగా సరస్వతి లలిత సామాన్లు లోపల పెట్టించి చేతిలో పిల్లాణ్ణి అందుకోబోతే వాడు 'కెవ్వు' మన్నాడు.

'ఇదేవిఁటి ఉత్రం పత్రం లేకుండా యిలా ఊడిపడ్డావ్ ?' అనడిగింది పార్వతమ్మ. 'ఆయనకి 15 రోజులు సిమ్లాలో ఏదో ట్రైనింగు ఉంది టత్తా...పిల్లల్తో ఒక్కర్తినీ ఉండలేనని నన్నిలా పంపించేశారు...

'మంచిపని చేశాడుగాని నువ్వేవిఁటి అంత నీర్సంగా ఉన్నావ్, పట్నం నీళ్ళు బాగా వంటబట్టాయా యేమిటి ?'

'అభిమానంకొద్దీ అలా అంటారు గాని నే నేమంత చిక్కిపోయానని? అయినా వయసులో ఉన్నవాళ్ళం...మరో అప్పుడు తంతిలా ఉన్నా మరుక్షణం బంతిలా తయారవగలం...మీరేవిటత్తయ్యా అంత మరీ చీపురుపుల్లలా తయారయారూ ?'

నరసింహంగారు పిల్లల్నందర్నీ కేకేశారు.

'ఒరే ! మీ రెప్పుడేనా చీపురుపుల్లని చూశారా ? ఇదిగో ఈవిడేట !' అంటూ పార్వతమ్మగార్ని చూపించారు.

అందరూ విరగబడి నవ్వేరు లలితతో సహా. కాని అందరికంటె ఆవి ణ్ణెక్కువ బాధించింది సరస్వతి నవ్వు.

'నవ్వండి...నవ్వండి ఇంట్లో ఉండి చేస్తున్నవాళ్ళు నా విలువ ఎవరికీ తెలీదు. పైకి దుక్కలా కనిపిస్తున్నా లోలోపల ఎంత గుల్లఅయిపోయిందో ఎవరికి తెలుసూ ? నే నంటే అభిమానపడే వాళ్ళకి నే నలా కనిపించి ఉంటాను. ఎప్పుడూ ఏదో నొప్పెట్టే మాట అని ఎదుటి వాళ్ళను ఎందుకో అందుకు ఏడిపిద్దాం అనుకునే వాళ్ళకు ఇందులో సారస్యం ఎలా అర్థమయి ఏడుస్తుందిలే...'

లలిత గబుక్కుని అందుకుంది.

'ఏమయినా నా మటుకు నాకు మీరేం బాగులేరు అత్తయ్యా! ఇప్పుడు బలానికీ రక్తపుష్టికీ కొత్తగా ఏవో యింజక్షన్లు వచ్చాయట......మీ అబ్బాయి చెప్పేరు...అవి పుచ్చుకుంటే ఏమయినా లాభిస్తుందేమో'.

'చూద్దాంలే......ఎన్ని వాడేంకాదు, అందులో యిదొకటీ...ఇంట్లో ఉన్నవాళ్ళకి పట్టలేదుగాని ఎక్కడో ఆమడదూరాన ఉన్న నీకు నేనంటే అంత యిదెందుకే వెర్రితల్లి...'

బియ్యం చేటలోపోసి పక్క వసారాలోంచి పట్టుగెడుతున్న సరస్వతి యీ మాటలు వింది. అత్తగారి మాటలు ఆమెకు కొత్తకాదుగాని ఆ రోజేమిటో మరింత బాధపడసాగింది.

సెలవులేక ఆయన రాలేదుగాని సరస్వతీ, మావగారు, అత్తగార్ని విశాఖపట్నం ఆసుపత్రిలో పూర్తిగా 'చెకప్' చేయించారు. వృద్ధాప్యంలోని బలహీనత తప్ప మరేం జబ్బు లేదన్నారు. అయినా ఆవిడ మంచం మీంచి కదలదు. పోనీ పెద్దది ఆవిణ్ణి శ్రమపెట్టడ మెందుకని అన్ని పనులూ సరస్వతే చేసుకుంటోంది. రెండు పూటలా వండిపెట్టేది తను. మూడు పూటలా మందులూ, పళ్ళరసాలూ యిచ్చేది తను...అయితే? మెప్పులేదు తనకు...ఇంటికి ఆడబడుచులు వస్తే సరే సరి...ఇంటిపట్టున ఉన్న కోడలు అయిష్టురాలై పోతుంది. నీళ్ళు తోడేది, దాసీది...వీళ్ళకున్న మెప్పు మన్ననా తనకి లేదు...

'ఇలాంటి అర్థాన్నపు రాతకి ఏ కొరమాలిన నోములు నోచానో...' అనుకుంది సరస్వతి.

'తల్లిలాంటి అత్తగారు మీరు. ఎలాంటి పూజలు చేశానో' అంటోంది లలిత :

తమ్ముడు రాసిన ఉత్తరం చదువుకుని ఎంతో భారంగా నిట్టూర్చింది సరస్వతి. ఆడదాని జీవితం ముల్లు పక్కనున్న అరిటాకు లాంటిది. కంచు చెంబుతో కలసి నీటిలో ప్రయాణం సాగిస్తున్న మట్టిపిడత లాంటిది.

'తనవాళ్ళయినా తన్నెందుకు సుఖంగా బతకనియ్యరు ?' అనుకుంది ఆమె. వాడి పరీక్ష మళ్ళీ పోయిందట. మంచిపనయింది. చదవకపోతే ఏమౌతుంది ? ఒక్క కొడుకని తన తల్లి వాడంటే విపరీతమైన ముద్దు. ఎన్నిసార్లు వా డడిగింది వాడి కివ్వొద్దని చెప్పినా ఆవిడకి బుద్ధిలేదు. చెప్పిచెప్పి ఆఖరికి ఒళ్ళుమండి తను అనేసింది.

'నువ్వు బతికుండగా వాడు బాగుపడ్డం కష్టం'. ఆ మాటకి తల్లికి ఎంత కోపం వచ్చిందో చెప్పలేం. ఎన్ని మాటలందో లెక్కబెట్టలేం...

'నీ కెందుకు నువ్వు నోరుముయ్యి : నీ యింట్లో నీ మాటకి చెల్లుబడి ఉందిగనకనా...యింకోళ్ళకి నీతులు చెబుతావా...' అనికూడ అనేసింది :

సరస్వతి ఉత్తరం చించేసి కన్నీళ్ళు తుడుచుకునేలోగా మేడ మెట్లు చప్పుడు వినిపించింది...మరుక్షణంలో లలిత అక్కడుంది.

'అబ్బ' ఈ గదిలో ఎంత చల్లగా గాలేస్తోందో...' అంటూ అక్కడ పరచివున్న మడతమంచం మీద వెల్లకిలా పడుకుంది.

'మరిదిగారు ఇప్పుడప్పుడే రారుగదూ : వస్తేరానీ, పడుకున్నదాన్ని లేవగొట్టి తగిలేస్తారా ఏమిటి...ఆ కూజాలో మంచినీళ్లు కొంచెం యిలా యిద్దూ సరస్వతీ......అఁ...ఏమిటి సంగతులు...మీ వాళ్లంతా బాగున్నారా ? ఆ మధ్య మీ అమ్మగారి కంటికి ఆపరేషను అనుకొన్నారు. ఇప్పుడు కులాసాయేనా ?'

'ఆఁ అందరూ బాగానే ఉన్నారు లలితా...వచ్చీ రాగానే మా వాళ్ళ గురించి అడుగుతావ్ నీ కెంత అభిమానమమ్మా :

'ఆఁ గాడిదగుడ్డు' అన్నట్టు లలిత పెదవి విరచి అటూ యిటూ దొర్లింది. ఒళ్ళు వీలయినంత విరుచుకుంది...ఆమెకు నిద్ర పట్టలేదు... కళ్లువిప్పి చూసింది.

'అబ్బా ఏమిటీ కాకిగోలా!' అనుకుంటూ.

సరస్వతి కిటికీలోంచి పెరటి వసారాలోకి చూస్తోంది. ఇంట్లో పిల్లలూ పొరుగింటి పిల్లలూ అందరూ కలసి 'మేకా, నిన్ పట్తాన్' 'కాల్ విరక్ కొడ్తాన్' అని కేకలేస్తూ పులీ మేకా ఆడుకుంటున్నారు.

'లలితా! మీరూ పిల్లలూ వచ్చి యింకా గంటయినా అవలేదు. అప్పుడే అందరూ ఏకమై హాయిగా ఆడుకుంటున్నారు. దండ గుచ్చి సరిగ్గా ఉందో లేదో చూసి పువ్వుల్ని జరుపుతే జరిగినట్టు—ఈజాతి మల్లె పూలదండ గుండ్రంగా తిరుగుతోంది. బతుకంటే పిల్లలది! సుఖమంటే పిల్లలది! ఇందులో మాయా, మర్మం వెతికినా లేదు. ఈ పిల్లల్ని కన్న తల్లులం మనం...ఆ మాట గర్వంగా ధైర్యంగా చెప్పగలిగే స్థితిలో మనం ఎప్పటికీ ఉండగలమా లలితా?'.

లలిత లేచి కూచుని సరస్వతి మొహంలోకి చిత్రంగా చూసింది. తర్వాత పకపక నవ్వింది.

'మొత్తానికి భలేదానివి సరస్వతీ నువ్వు...మా చిన్న చెల్లాయి వయసున్నా మా పెద్దమ్మమ్మ భావాలు నీవి'.

సరస్వతి అయోమయంగా లలిత వైపు చూసింది.

'సీరియస్‌నెస్'కూ నాకూ సగమెరిక అన్న విషయం నీకు తెలిసిందే. అయినా నిన్ను చూస్తే ఏదో బాధపడుతున్న నీతో కొన్ని విషయాలు 'డిస్కస్' చేద్దామనిపిస్తోంది...ఎంచేతంటే అందుబడిలో లేని ఆదర్శాల కోసం అలమటించేవాళ్ళని చూస్తే నా కేమాత్రం సానుభూతి లేదు సుమా! సరస్వతీ ఈ జీవితం ఒక నాటకమని నువ్వు ఒప్పుకుంటావా?'

సరస్వతి ఊఁ అనలేదు, ఆఁ అనలేదు.

'పోనీ యిది తాత్కాలికమని ఒప్పుకుంటావా ?'

సరస్వతి అర్ధాంగీకారంగా వింటూ ఊరుకుంది.

'వెయ్యి ప్రయత్నాలు మనం చేస్తే విధి వ్యతిరేకంగా ఒక్క మొత్తు మొత్తవచ్చు. నీతి నిజాయితీ నిరూపించుకొనే లోగానే ఊగుతున్న దీపాన్ని ఊహాతీతమైన శక్తి ఏదో 'ఉష్'మని ఊదెయ్య వచ్చు'.

'ఆయితే నువ్వు అనేదేమిటి ?'

'ఏమీలేదు...ఈ జీవన నాటక రంగంలో మన పాత్ర ఎంత చిన్నదైనా సర్వజనాదరణీయంగా నిర్వహించాలని...మనం వేసుకున్నవి వేషాలని ఏ క్షణమూ మరచిపోవద్దని...'

లలిత ఒక క్షణం ఆగి మళ్ళీ మొదలెట్టింది.

'అవును...దేవుడిమీద నమ్మకం లేనివాళ్ళు తమ పాత్ర ఎలా నటించినా అడిగేవాడు లేడన్నంత ధీమాతో నటించవచ్చు. దేవుడి మీద నమ్మకం ఉన్నవాళ్ళు వాళ్ల యిష్టం వచ్చినట్లు హాయిగా నటించి 'ఆయన నడిపించే వాడు, మేం నడిచేవాళ్లం, మధ్య మా దేముంది ?' అని అవసరం వచ్చినపుడు మనసుకి జవాబు చెప్పుకోవచ్చు !'

సరస్వతికి వాళ్ళ ఆయన రాసిన కథ ఒకటి హఠాత్తుగా జ్ఞాపకానికి వచ్చింది. అందులో ఒక చోట సంభాషణ యిలా నడుస్తుంది.

'నిజంగా మంగలి అప్పన్న ఎంత గొప్ప వేదాంతి !'

'ఏం ?'

'సుఖదుఃఖాల్ని ఒక్కలా చూడగలిగిన చిత్తస్థైర్యం వాడికే చెల్లింది ! పెళ్ళికికూడా వాడు చావు బాజాలాగే వాయిస్తాడు !'

సరస్వతికి నవ్వొచ్చింది.

'ఎందుకు నవ్వుతున్నావ్ ?'

'ఏదో జ్ఞాపకానికి వచ్చింది...దానికేం గాని...నువ్వు నీ పాత్రని అందరికీ సరదాగా ఉండేటట్టు నటించే నటీమణివని చెప్పుకుంటున్నావు కదా, నువ్వు యింత సేపూ బోధించింది నిజమని నే నెలా నమ్మను ?'

సరస్వతి ఊహించినంతగా లలిత ఉక్కిరి బిక్కిరి అవలేదు. కొంచెం ఆగి అంది.

'ఎలా నమ్మను అని అడుగుతావేమిటి, అప్పుడే నమ్మేవు కూడా'.

'అదెలా ?'

'అదే చెప్తాను విను. అది చెప్పేముందు నీకు చిన్న ఉదాహరణకూడా యిస్తాను. ముందేనా చెప్పకుండా అప్పటికప్పుడు మా మరిదిగారు ఆరుంపావుకి వచ్చి సినిమాకు రమ్మనమని కూచున్నారనుకో...నువ్వేం చేస్తావ్ ?'

'అప్పటికప్పుడు బయలుదేరడానికి నా కెలా కుదురుతుంది ?'

'అదే—మన వాళ్ళు సాధారణంగా చేసే పొరపాటు. నేనయితే అలా చెయ్యను. ఆయనే వచ్చి సినిమాకు రమ్మంటే అవితల ఎవరేనా చచ్చినా నా కభ్యంతరం ముండదు. హఠాత్తుగా ఆయన రమ్మన్నారనుకో. నేను వంటింట్లోకి వెళ్ళి చూస్తాను. అన్నం ఉడుకుతూ ఉడుకుతూ ఉంటుంది. ముక్కలు వేగుతూ వేగుతూ ఉంటాయి. ఆ అన్నం అలా దింపేస్తాను. మూకుడు కింద పెట్టేస్తాను. డబ్బాడు పొడరు మాది కాదనుకుని నేనూ పిల్లలూ ఆయన వెంట వీధిని పడతాం'.

'మరి భోజనాలు ?'

'ఏ హోటల్లోనో చేస్తాం...'

'ఆ వంటకాలు ఏంచేస్తావు ?'

'తిప్పి తిప్పి కాలవలోకి విసిరేస్తాను. నాకేం ? ఆ సంగతి చక్కని సమయం కనిపెట్టి ఆయనతో చెబుతాను. ఊరూ వాడా ఒక్కసారి

అంటుకోనీ, దేశమంతా గంగపాలు కానీ...మీ మాటే నాకు ప్రాణం అని...అందరూ నన్ను లల్లీ అని పిలుస్తారు. ఆయన మటుకు ఒకసారి 'లైలీ' అంటారు. మరోసారి 'లల్లీ' అంటారు. నాలాంటిది కాక మరెవరు రాణీ ?'

సరస్వతి చెప్పలేనంతి ఆశ్చర్యంతో లలితవైపు చూసింది.

"సరస్వతీ, 'అబద్ధ మాడరాదు, దొంగతనము చేయరాదు' ఇలాంటివి చిన్నప్పుడే ఎందుకు కంఠతా పెట్టిస్తారనుకున్నావ్, పెద్దవగానే మరచి పోమని......అనుభవజ్ఞులు చెప్పిన మాటలు మనం ఎందుకు కాదనాలని. కాకి కయినా నువ్వు నల్లగా ఉన్నావని 'కా' భాషలో చెప్పినా ఒప్పుకోదే... ఉన్నమాట చెప్పి మనం ఎదుటి వాళ్లని ఎందుకు నొప్పించాలని ?"

'జీవితంలో నిజమనే మాటకు అర్థమే లేదనే నీ భావం నేను పూర్తిగా గ్రహించ లేకుండా ఉన్నాను లలితా ! ఒకళ్లు వంచనతో మెప్పు పొందితే మంచివాళ్లకు నష్టం కాదా ?'

'సరే జవాబు చెపుతా విను...ఇవాళ మనం గోంగూర పచ్చడి కదూ వేసుకు తిన్నాం...గోంగూర ఆకుల మీద అక్కడక్కడ చీడ కనిపిస్తే ఆకుల్ని తినేస్తున్నాయని పురుగుల మీద మనం విసుక్కున్నాం. గోంగూరని చూసి జాలిపడ్డాం. ప్రత్యుపకారంగా మొక్కల్ని సమూలంగా పీకి పచ్చడి చేసేశాం ! ఏది మంచి, ఏది వంచన ?'

సరస్వతి ఫక్కున నవ్వింది.

'నీకు అపజయం అన్నది లేదు లలితా ! కాని నువ్వు గెలిచావని ఒప్పుకోడానికి నా మన సింకా అంగీకరించడం లేదు. ఏమయినా నీ వాగ్మాధురికి ఒక్క నమస్కారం.'

'పెద్దదాన్ని, దీవించనా ?'

సరస్వతీ, లలితా యిద్దరూ కలిసి నవ్వేరు.

'నీ కాంప్లిమెంటుకి నా థేంక్సు. అత్తగారి పక్కని తడిబట్టతో వెంకటేశ్వర దీపారాధనచేసినా, ఆయనగారి సమక్షంలో నాన్‌వెజిటేరియన్ కట్‌లెట్లు బెడ్ టిఫిన్‌గా సమారాధన చేసినా నా లాంటి వాళ్లకే చెల్లిందని మాత్రం గుర్తుంచుకో...' అన్నట్టు నువ్వింందాక అడిగిన దానికి జవాబు చెప్పాలిగా. నేను చెప్పింది నువ్వు నమ్మేవని రుజువు చేస్తాననీ...'

'అవునవును మరచేపోయాను చెప్పు...'

'నేను రాగానే నిన్నడిగాను మీ అమ్మగారు బాగున్నారా అని. నువ్వే మన్నావో గుర్తుందా 'రాగానే మా వాళ్ల గురించి అడుగుతావు. ఎంత అభిమానమమ్మా నీకు ?' అని. నిజానికి మీవాళ్ల గురించి అంత ఆప్యాయంగా అడగవలసిన అవసరం నాకు ఉందా ? లేదు. ఒకవేళ ఉంటే క్రియారూపంగా నేను చేసిందేమైనా ఉందా ? లేదు. ఈ సంగతి ఆలోచించ కుండా నువ్వెందుకు నమ్మేసట్టు ?'

సరస్వతి వెలవెల బోయింది.

'సరస్వతీ, నీకు సంగీతం వచ్చునని నాకు తెలుసు. నాకు 'సంగతులు' తెలుసునని నీకు తెలిసిందా ?'

'ఏమర్రా ఇక ఆ మేడ దిగరా ఏవిఁటి ?' పార్వతమ్మ గారు కేకెట్టింది.

'అయ్యో, ఎంత పొరపాటై పోయింది ! నిద్రపట్టి పోయింది అత్తయ్యా! మరోలా అనుకోకండి...అక్కడ మీ రొక్కరూ ఏం యిబ్బంది పడుతున్నారో—ఆఁ ఈఁవిడకీ నాకూ ఉన్న పనేవిఁటిగాని...ఒస్తా సరస్వతీ, తర్వాత మాట్లాడుకుందాం. కాని ఒక్కమాట. మాటకి మాట తాళం వేస్తే ఎలాంటి తాళమైనా తియ్యడం సులువు సుమీ !...నీ వీలు చూసుకుని నా దగ్గిరకు వచ్చి పదిరోజు లుండు సరస్వతీ—ఆఁ వచ్చే' నాలుగేసి మెట్లు ఓ సారి దొప్పున గెంతుతూ లలిత మేడ దిగిపోయింది.

లలిత బోధనతో మారిపోయి—వెంటనే తెంపలేసుకుని ఆనాటి నుంచి సరస్వతి అత్తగారి అడుగులకి మడుగు లొత్తుతూం దనుకోవడం కేవలం పొరపాటు. ఎవరి భావాలూ నమ్మకాలూ వాళ్ళవి కాని ఆనాటి సంభాషణ మాత్రం సరస్వతి అందమైన అనుభవంగా ప్రతి అక్షరం జ్ఞాపకం ఉంచుకుంటుంది. ఆ అనుభవం సత్యమా, స్థిరమా అని అడుగుతే మాత్రం ఆమె మనస్సు ఖస్సుస లేస్తుంది. వస్తువుకి రూపం, పదానికి అర్థం, భావానికి నిర్వచనం ప్రతి క్షణం మారిపోయే చిత్రమైన ఈ ప్రపంచంలో మాయ ఒక్కటే మధురమైనదని ఆచరించి ఆనందించే లలిత చరిత ఆకర్షణ ఎన్నాళ్లు ? ఏమో !